మీకు తెలుసా?

**తెలంగాణలో ఎంబీబీఎస్ సీట్లు**

| రాష్ట్రం మొత్తం | ప్రభుత్వ కాలేజీల్లో |
|---|---|
| 2014లో: 2,850 | 2014లో: 850 |
| ఇప్పుడు: 8,340 | ఇప్పుడు: 3,790 |








# ఎద్దు ఏడ్చిన ఎవుసం..

బిగ్ స్టోరీ



# హలం నవ్విన పొలం



## కాగితాలపైనే జలయజ్ఞం 'ప్రాజెక్ట్' వర్క్ ఫలితమిది

2014

| సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో నత్తకు నడక నేర్పిన చరిత్ర కాంగ్రెస్‌ది | పదేండ్ల పాలనలో వాళ్లు సాగు నీరిచ్చింది 92 వేల ఎకరాలకే | తొమ్మిదిన్నరేండ్లలో 90 లక్షల ఎకరాలకుపైగా సాగు నీరిచ్చిన తెలంగాణ సర్కారు | పాత రోజులొస్తే మళ్లీ పడకేయనున్న సాగునీటి ప్రాజెక్టులు |
|---|---|---|---|

**లోయర్** పెనుగంగ ప్రాజెక్టు... 1978, ఆగస్టు 7న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నది. కానీ తెలంగాణ ఏర్పడేనాటికి తట్టెడు మట్టి పని కూడా చేయలేదు. చివరకు తెలంగాణ ప్రభుత్వం ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో సుమారు 50 వేల ఎకరాలకు సాగు నీరు అందించే చనాక-కొరాట బరాజ్ నిర్మించింది. అంటే మూడున్నర దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుకు సీఎం కేసీఆర్ ఊపిరి పోశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ 2004-2014 వరకు అంటే పదేండ్లు అధికారంలో ఉన్నది. జలయజ్ఞం కింద తెలంగాణలో 33 ప్రాజెక్టుల (18 మేజర్, 12 మీడియం, 2 ఆధునీకరణ, ఒకటి ఫ్లడ్ బ్యాంక్ పనులు) ద్వారా 2-5 సంవత్సరాల్లోనే 48.52 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించింది. రాష్ట్రం ఏర్పడే నాటికి దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసింది. కానీ 33 ప్రాజెక్టుల్లో కేవలం అలీసాగర్, గుత్ప ఎత్తిపోతలతోపాటు సుద్దవాగు మధ్య తరహా ప్రాజెక్టు మాత్రమే పూర్తయ్యింది. పదేండ్లలో ఆ పార్టీ కేవలం 92 వేల ఎకరాలకే సాగునీటి సౌలభ్యాన్ని చేకూర్చగలిగింది.

**కాంగ్రెస్** పార్టీ ఉమ్మడి పాలమూరు జిల్లాలో పదేండ్ల నుంచి పూర్తి చేయకుండా పెండింగ్‌లో ఉంచిన ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం కేవలం రెండేండ్లలోనే పూర్తి చేసింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్‌ను అతి తక్కువ సమయంలోనే పూర్తి చేసి కేవలం ఈ నాలుగు ప్రాజెక్టుల కింద ఉన్న ఐదు లక్షల ఎకరాల బీడు భూముల్ని సిరులు పండించే మాగాణంలా మార్చింది. ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడు సంవత్సరాల్లో పూర్తి చేసింది.

**తెలంగాణలో ప్రస్తుతం ప్రాజెక్టులు, చెరువులు, బోర్ల కింద 1.12 కోట్ల పైచిలుకు ఎకరాలు సాగవుతున్నది. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో నికరంగా సాగునీరు అందుతున్న భూమి విస్తీర్ణం సుమారు 22 లక్షల ఎకరాలు. అంటే... 2014 నుంచి ఇప్పటి వరకు సీఎం కేసీఆర్ నేతృత్వంలో అదనంగా దాదాపు 90 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తున్నారు. అందుకే పంజాబ్ రాష్ట్రాన్ని వెనక్కి నెట్టి మూడున్నర కోట్ల పైచిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి దేశానికే అన్నపూర్ణగా నిలిచింది తెలంగాణ.**

... గుండాల కృష్ణ

దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎలా సాగిందో? తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కృష్ణా-గోదావరి నదులపై ప్రాజెక్టుల పనులు ఎలా పరుగులు పెట్టాయో? చెప్పడానికి పై ఉదాహరణలు చాలు. రాష్ట్రం ఏర్పడేనాటికి తెలంగాణ సాగునీటి వెతలు రాసుకుంటే రామాయణమంత! చెప్పుకుంటే మహా భారతమంత!! కానీ తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెండింగు ప్రాజెక్టుల్ని రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చడంతోపాటు గోదావరిపై కాళేశ్వరం, కృష్ణాపై పాలమూరు-రంగారెడ్డి సహా అనేక భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల్ని పూర్తి చేసింది. మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవాన్ని తీసుకువచ్చింది. బోరుమన్న బోర్ల నుంచి నురగలు గక్కుతూ జలాలు చేలల్లో పడి పరుగులు పెట్టేలా చేసింది. అందుకే ఇప్పుడిప్పుడే తెలంగాణ రైతన్న ముఖంలో చిరునవ్వు కనిపిస్తున్నది. మరి... పట్టు తప్పి మళ్లీ పాత రోజులొస్తే?! ప్రాజెక్టులన్నీ పడకేస్తాయి. నదీజలాలన్నీ సముద్రం బాట పడతాయి. పచ్చని చేలన్నీ తిరిగి నోర్లు తెరిచే బీడు భూములుగా మారుతాయి. తింటున్న కంచాన్ని కాలితో తన్నుకుందామా?! మనమే తేల్చుకోవాలి.

### నాడు విష వలయంలో తెలంగాణ ప్రాజెక్టులు

**ఉ**మ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులంటేనే చుట్టూ విష వలయాలు. అంతర్రాష్ట్ర వివాదాలు సృష్టించడం... ఉన్న వివాదాల్ని జటిలం చేయడం... ఆపై పర్యావరణ అనుమతుల్లో ఇరికించడం... ఇదంతా అప్పటి ఆనవాయితీ. తెలంగాణ అంతర్రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులన్నీ ఇంతే. ప్రతిపాదనలు రూపు దాల్చుకోవడానికి కొన్నేండ్లు. పక్క రాష్ట్రంతో సంప్రదింపులు మొదలుపెట్టేందుకు మరికొన్నేండ్లు. పనులు మొదలుకాకుండా అటకెక్కినవే చాలా.. అయితే, బతుకుజీవుడా!! అంటూ ప్రారంభమైన ప్రాజెక్టులు కొన్ని. అయితే పూర్తయిన తర్వాత వంద శాతం ఫలితం వచ్చిన సాగునీటి ప్రాజెక్టు ఏ ఒక్కటీ లేదు. లోయర్ పెనుగంగపై తలపెట్టిన చనాక-కొరాట బరాజ్, లెండి నదిపై నిర్మించాల్సిన లెండి ప్రాజెక్టు, ప్రాణహితపై తలపెట్టిన ప్రాణహిత ప్రాజెక్టు 1975లో మహారాష్ట్రతో ఒప్పందం జరిగాయి. వీటిలో లెండి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేదాక అటకపైనే ఉన్నాయి. చనాక-కొరాట కూడా అంతే. ఒప్పందం జరిగిన నాలుగు దశాబ్దాల తర్వాతగానీ సాంకేతిక ఒప్పందం పూర్తి కాలేదు. ప్రాణహిత ప్రాజెక్టునైతే... ప్రాణహిత-చేవెళ్ల రూపంలో మహారాష్ట్రతో సంబంధం లేకుండానే చేపట్టారు. రూ.8 వేల కోట్లను బూడిదలో పోసిన పన్నీరులా మార్చారు. అంతెందుకు... ఇప్పుడు కాంగ్రెస్ గొప్పగా చెప్పుకొంటున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిస్థితీ ఇంతే. 1963లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేస్తే 1981లో ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. 1983లో నీటిని విడుదల చేయగా... 1984లో గేట్లను అమర్చారు. తెలంగాణ ఏర్పడేదాకా రెండో దశ, వరద కాల్వ అంటూ అది డక్కామొక్కీలు తింటూనే ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టి పనులన్నీ పూర్తి చేయడంతోపాటు నీళ్లు పారకముందే శిథిలావస్థకు చేరుకున్న కాకతీయ కాల్వను కూడా పునరుద్ధరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యాన నాలుగైదేండ్లుగా ఎస్సారెస్పీ కింద పూర్తి ఆయకట్టుకు సాగు నీరు అందుతున్నది.


నెర్రెలుబారిన నేలలో బతుకుపోరు నిత్యకృత్యం


సాగునీరు లేక 'చేతి'కొచ్చే వేళ ఎండిన పంట

### కృష్ణాపైనా అదే దుస్థితి

**గో**దావరి నదిపైనే కాదు కృష్ణా నదిపై చేపట్టిన అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల దుస్థితి కూడా ఇలాగే ఉంది. జూరాల ప్రాజెక్టు బచావత్ ట్రిబ్యునల్ కనికరించి 18 టీఎంసీలు ఇస్తే నిర్మించాలని నిర్ణయించిన ప్రాజెక్టు. 1960 బచావత్ అప్పటి పూర్తయిన, ఆన్‌గోయింగ్, ప్రతిపాదిత ప్రాజెక్టుల కేటాయింపులు పూర్తి చేయగా కొన్ని టీఎంసీలు మిగిలాయి. దీంతో హైదరాబాద్ స్టేట్ ఏపీతో కలవడంతో అత్యధికంగా మహబూబ్‌నగర్ ఏడు లక్షల ఎకరాలకు సాగు నీటిని నష్టపోయిందనే విషయాన్ని బచావత్ దృష్టికి తెచ్చారు. అప్పుడు కనికరించి 18 టీఎంసీలను కేటాయించారు. తర్వాత 1981లో ఎట్టకేలకు ప్రాజెక్టు మొదలైతే.. 2000 సంవత్సర కాలంలోగానీ నీటి విడుదల జరగలేదు. అంటే కేటాయింపులు జరిగిన నాలుగు దశాబ్దాలకుగానీ జనం నీటిని చూడలేదు. అయినప్పటికీ ఇప్పుడు దాని పూర్తిస్థాయి సామర్థ్యం 9.67 టీఎంసీలు.. లైవ్ స్టోరేజీ కేవలం 5.95 టీఎంసీలు. ఇప్పటి కల్వకుర్తి ప్రాజెక్టుకు కూడా 1991లో ప్రతిపాదనలు రూపొందించారు. జలయజ్ఞం కింద చేపట్టి అసంపూర్తిగా ఉంచితే, తెలంగాణ ప్రభుత్వం వచ్చి దాన్ని పూర్తి చేసింది. ఇదీ ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాజెక్టుల పరిస్థితి. భారీవే కాదు మధ్య తరహా ప్రాజెక్టులదీ ఇదే అవస్థ. ఇక చెరువులనైతే గొంతు నులిమి చుక్క నీరు నిల్వ ఉండకుండా చేశారు.


దగాకోరు పాలనలో తగలబడిపోయిన రైతు బతుకులకు సాక్ష్యమిది!

### అదో... ధనయజ్ఞం!

**ఉ**మ్మడి రాష్ట్రంలో చేపట్టిన జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టులు సమైక్య పాలకుల నిర్లక్ష్యానికి సజీవంగా నిలిచాయి. 2005 నుంచి 2007 మధ్య కాలంలో తెలంగాణ ప్రాంతంలో 33 ప్రాజెక్టులు (18 మేజర్, 12 మీడియం, 2 ఆధునీకరణ, ఒకటి ఫ్లడ్ బ్యాంక్ పనులు) ఎంచుకున్నారు. 2-5 సంవత్సరాల్లో రూ.1.03 లక్షల కోట్లతో తెలంగాణలోని 48.521 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది జలయజ్ఞం లక్ష్యం. కానీ సరైన డిజైన్ లేకపోవడం, సాంకేతిక అంశాలను సరిగా చూసుకోకపోవడం, అధ్యయనం చేయకపోవడం, చివరకు భూసేకరణ, పర్యావరణ, రైల్వే, ఆర్అండ్‌బీ... ఇలా ఇతర శాఖల అనుమతులు తీసుకోవడంలోనూ నిర్లక్ష్యం వహించారు. ఈపీసీ విధానంలో ఇచ్చిన ఈ ప్రాజెక్టుల పనుల్లో మొబిలైజేషన్ అడ్వాన్స్ జేబులో వేసుకొని పనులను గాలికొదిలిన కాంట్రాక్టర్లూ కొంతమంది ఉన్నారు. ఇలా కర్ణుడి చావుకు అనేక కారణాలు అన్నట్లు ఈ ప్రాజెక్టుల పనులు వివిధ కారణాలతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకంతోపాటు సుద్దవాగు మధ్య తరహా ప్రాజెక్టులు మాత్రమే పూర్తయిన వాటి జాబితాలో ఉన్నాయి. ఇలా పదేండ్ల పాటు ధన యజ్ఞ కార్యక్రమం ద్వారా రూ.40 వేల కోట్ల వరకు ఖర్చు చేసి కేవలం 92 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు మాత్రమే నీళ్లందించారు.




## అపర భగీరథుడి సంకల్పంతో కోటి ఎకరాల మాగాణం

**విష వలయాన్ని ఛేదించి...**

**ఒ**క్క ప్రాజెక్టులోనూ పట్టుమని పది టీఎంసీల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు ఉండవు... కానీ పదహారు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామంటారు. మరో ప్రాజెక్టుకు రూ.వేల కోట్లు ఖర్చు పెడతారుగానీ బరాజ్ నిర్మాణాన్ని అంతర్రాష్ట్ర వివాదంలోకి నెడతారు. ఇంకో ప్రాజెక్టు తెలంగాణ ఖాతాలో కనిపిస్తుంది. ఆయకట్టు లక్ష్యం కృష్ణా డెల్టాలో దాగి ఉంటుంది. ఇలా దశాబ్దాల తరబడి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు విష వలయంలో చిక్కుకుని కాంట్రాక్టర్ల కామధేనువుల్లా మారాయే తప్ప ఎకరా భూమికి సాగునీరు ఇవ్వలేదు. అందుకే తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎవరి దయా దాక్షిణ్యాలు అవసరంలేదని... ప్రాజెక్టులు కట్టాలని సంకల్పించిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆకుపచ్చ తెలంగాణ కోసం ప్రతి సాగునీటి ప్రాజెక్టునూ బహుముఖ కోణంలో డిజైన్ చేశారు. పట్టుబట్టి వేల కోట్ల నిధులు ఇచ్చి, ప్రతిక్షణం పర్యవేక్షిస్తూ ప్రాజెక్టుల పనులను పరుగెత్తించారు. జలయజ్ఞం కింద చేపట్టిన పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. ఆ చిత్తశుద్ధి ఫలితంగానే కేవలం తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ సాగునీటి, వ్యవసాయ రంగ ముఖచిత్రాలే మారిపోయాయి. రాష్ట్ర ఏర్పాటు నాటికి వానకాలం, యాసంగి కలిపి మొత్తంగా 1.30 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కాగా, నేడు అది ఏకంగా 2.30 కోట్ల ఎకరాలకు పెరిగింది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపుల్లో ఉమ్మడి పాలనలో తెలంగాణలోని ప్రాజెక్టుల కింద వానకాలం, యాసంగి రెండు సీజన్లకు కలిపి నీటి వినియోగం గరిష్ఠంగా 300 టీఎంసీల లోపు ఉంటే ఇప్పుడు ఒక్క యాసంగి సీజన్‌లోనే 330 టీఎంసీల పైచిలుకు నీటి వినియోగం ఉన్నది. అందుకే గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో రాష్ట్రంలో సాగునీటి వసతుల కల్పనలో 76.92 శాతం వృద్ధి నమోదయ్యింది.

**దేశానికే పాఠాలు నేర్పిన తెలంగాణ...**

**గతంలో ఒక సాగునీటి ప్రాజెక్టు కట్టడమంటే ముగ్గురు, నలుగురు ముఖ్యమంత్రులు మారినా పూర్తికాని పరిస్థితి. కానీ తెలంగాణ రైతుల గోడు తీర్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడేండ్లలోనే పూర్తి చేసిన కేసీఆర్ రాష్ట్రాన్ని దేశ సాగునీటి రంగానికి దిక్సూచిలా నిలిపారు.**

✦ తెలంగాణకు గుదిబండలా మారిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి రూపకల్పన చేసిన కాళేశ్వరం ఎత్తిపోతలతో ఏడాది పొడవునా గోదావరిలో జలకళ ఉట్టి పడుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుకు 2016, మే 2న శంకుస్థాపన చేయగా.. 2019, జూన్ 21న సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అప్పటివరకు గోదావరి నుంచి 90 టీఎంసీలను కూడా పూర్తిస్థాయిలో వాడుకోలేని విషమ పరిస్థితి నుంచి నేడు గరిష్ఠంగా 400 టీఎంసీలు వినియోగించుకునే స్థాయికి ఎదిగాం. శ్రీరాంసాగర్ చరిత్రలో ఇప్పుడు తొలిసారిగా కాకతీయ కాల్వ చివరి ఎకరా వరకు గోదావరి జలాలు పుష్కలంగా అందుతున్నాయి.

✦ **పాలమూరు-రంగారెడ్డి** ప్రాజెక్టు ప్రతిపాదన దశాబ్దాల కిందటిది. కాంగ్రెస్ పార్టీ నీటిని ఎక్కడి నుంచి తీసుకోవాలనే దానిపైనే సంవత్సరాల తరబడి కాలయాపన చేసింది. చివరకు పట్టుమని పది టీఎంసీల నీటి నిల్వ లేని జూరాల నుంచి ఇన్‌టేక్ పాయింట్ పెట్టి తెలంగాణకు ద్రోహం చేసేందుకు ప్రయత్నించింది. కానీ సీఎం కేసీఆర్ ఏకంగా శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ నుంచి ఇన్‌టేక్ పాయింట్ పెట్టి పనుల్ని పరుగులు పెట్టించారు. తెలంగాణ ఏర్పడేనాటికి తాగునీటికి సైతం గుక్కెడు నీరు దొరకని ఉమ్మడి పాలమూరు గడ్డ మీద ఏకంగా 70 టీఎంసీల నీటి నిల్వకు రిజర్వాయర్లు పూర్తి చేయడమంటే చరిత్రలోనే ఒక రికార్డు.

✦ **ప్రతి జిల్లాలోనూ** భారీ, మధ్యతరహా ప్రాజెక్టులతోపాటు చెరువులను పునరుద్ధరించి తెలంగాణలో 22 లక్షలుగా ఉన్న సాగు విస్తీర్ణాన్ని ఏకంగా 1.20 కోట్లకు పైగా పెంచారు.

✦ **ఆదిలాబాద్** ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల పెండింగ్ ప్రాజెక్టు చనాక-కొరాటతోపాటు మధ్య తరహా ప్రాజెక్టును పూర్తి చేయడంతో కొత్తగా 4,47,488 ఎకరాలకు సాగునీరు అందించారు.

✦ **కరీంనగర్** ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం, మిడ్ మానేరు పెండింగ్ పనులను పూర్తి చేసి, ఎస్సారెస్పీ రెండో దశకు మోక్షం కల్పించారు. అక్కడ 5,56,899 ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించారు.

✦ **ఖమ్మం** ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ రెండో దశ, భక్త రామదాసు, సీతారామ ప్రాజెక్టుతో అదనంగా 3,79,410 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించారు.

✦ **నల్లగొండ** ఉమ్మడి జిల్లాలో ఉదయ సముద్రం, ఎస్సారెస్పీ రెండో దశ, ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసి అదనంగా 5,97,471 ఎకరాలకు సాగునీరు అందించారు. విద్యాసాగర్‌రావు దిండి ప్రాజెక్టు పనులనూ వేగంగా పూర్తి చేస్తున్నారు.

✦ **నిజామాబాద్** ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం పథకంలోని ప్యాకేజీ 21-23, సదర్‌మాట్, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం వంటి వాటిని పూర్తి చేసి అక్కడ 4,91,689 ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించారు.

✦ **ఉమ్మడి పాలమూరు జిల్లాలో** పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు పాలమూరు-రంగారెడ్డి స్వప్నాన్నీ సాకారం చేశారు. తద్వారా రాష్ట్రంలోనే అత్యధికంగా 10.77 లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడం రికార్డు.

✦ **ఉమ్మడి మెదక్‌ను** కాళేశ్వరంతో జలభాండంగా మార్చారు. 5,72,273 ఎకరాలకు కొత్తగా సాగునీరు ఇచ్చారు.

✦ **ఉమ్మడి వరంగల్** జిల్లాలో కాళేశ్వరం, దేవాదుల, సమ్మక్క బరాజ్‌లతో 4,95,354 ఎకరాలకు సాగునీరిస్తున్నారు.

✦ **రంగారెడ్డి జిల్లాలోనూ** చెరువుల పునరుద్ధరణతో అదనంగా 1,64,103 ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లాలో 8 లక్షల ఎకరాలకు లబ్ధి చేకూరుతుంది.

✦ **సాగునీటి రంగం** అభివృద్ధి, నీటి వనరుల సంరక్షణలో రాష్ట్రం దేశానికే ఆదర్శం. మిషన్ కాకతీయ ద్వారా నాలుగు దశల్లో రూ.9,155 కోట్లతో 27,584 చెరువులను పునరుద్ధరించింది. వాగుల పునరుజ్జీవ పథకం కింద 1,200 చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. తద్వారా రాష్ట్రంలో సగటున ఆరు మీటర్లకు పైగా భూగర్భజలాలు పెరిగి.. లక్షలాది బోరుబావుల్లో సమృద్ధిగా నీటి లభ్యమవుతున్నది.


లక్ష్మి పంప్‌హౌస్


పాలమూరు-రంగారెడ్డి

### చారిత్రక అంతర్రాష్ట్ర ఒప్పందాలు

**అం**తర్రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులంటేనే మనకు గుర్తుకొచ్చేది... 1970 దశకం. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరిపై అనేక ప్రాజెక్టులకు సంబంధించి మహారాష్ట్రతో ఒప్పందాలు చేసుకున్నారేగానీ ఏ ఒక్కదాన్నీ కొస వరకు తీసుకుపోలేదు. చివరకు ప్రాణహిత-చేవెళ్లకు సంబంధించి తుమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తామని చెప్పి... 2008 నుంచి 2014 వరకు అసలు మహారాష్ట్రతో సంప్రదింపులు కూడా జరపలేదు. ఫలితంగానే 2013లో అప్పటివరకు బరాజ్ పనులు మొదలుపెట్టకుండానే సొరంగాలు, కాల్వలు తవ్వకానికి వెచ్చించిన రూ.8 వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరే అని అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ ఉమ్మడి ఏపీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి లేఖ కూడా రాశారు. ముఖ్యంగా కేంద్రం... మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఉమ్మడి ఏపీలోని కాంగ్రెస్ పార్టీ ప్రాణహిత-చేవెళ్లపై అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకోలేదంటే ఆ పార్టీకి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదనే విషయాన్ని తేటతెల్లం చేస్తున్నది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2016లో సీఎం కేసీఆర్ గోదావరిపై మహారాష్ట్రతో ఒకేరోజు ఏకంగా మూడు ఒప్పందాలు చేసుకోవడం చారిత్రాత్మక పరిణామం.

1. లోయర్ పెనుగంగ : చనాక-కొరాట బ్యారేజీ
2. ప్రాణహిత ప్రాజెక్టు : తుమ్మిడి హట్టి బ్యారేజీ (184 మీటర్లు)
3. కాళేశ్వరం ప్రాజెక్టు : మేడిగడ్డ బ్యారేజీ (వంద మీటర్లు)


మిడ్‌మానేరు